క్లుప్తంగా

బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలి

పాల్వంచరూరల్: ఇంటింటికీ తిరిగి బీఎల్ఓలు ఓటర్ల వివరాలను సేకరించాలని తహసీల్దార్ రంగాప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్‌లో గురువారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ జాబితా ఆధారంగా మృతి చెందిన ఓటర్ల వివరాలు, చిరునామాలు మారిన ఓటర్ల వివరాలు, పేర్ల తప్పుల సవరణతోపాటు కొత్త ఓటర్ల నమోదు వివరాలను నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో సీడీపీఓ కనకదుర్గ, బీఎల్ఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్ పాసులు

చుంచుపల్లి: ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో చదువుకునే 12 ఏళ్లలోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలకు కొత్తగూడెం డిపో నందు ఉచితంగా బస్సు పాసులు జారీ చేయబడతాయని డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వైబ్‌సైట్‌లో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.50 ఫీజు చెల్లించి పాస్ పొందాలని తెలిపారు. వివరాలకు 9959225959 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొమరారం పీహెచ్‌సీకి రెండు అవార్డులు

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని కొమరారం పీహెచ్‌సీకి నియోజకవర్గ స్థాయిలో రెండు అవార్డులు దక్కాయి. ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ లోహిత, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా లలితకుమారి వేడుకల్లో అవార్డులను అందుకున్నారు. ఆస్పత్రికి రెండు అవార్డులు రావడం పట్ల గురువారం ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వైద్యాధికారి లోహిత, ఎల్‌టీ లలితకుమారిలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యశిబిరానికి స్పందన

పాల్వంచరూరల్: మండల పరిధి దంతలబోరు ఎస్సీకాలనీలో గురువారం జీఎస్ఆర్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు దివ్య, వాణి, ప్రవీణ్, షాలీమ్, రమేష్ 170 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దల రమేష్, ట్రస్ట్ నిర్వాహకులు మధుకర్ పాల్గొన్నారు.

హోంగార్డు మస్తాన్‌కు సన్మానం



మస్తాన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం యూనిట్‌లో పని చేస్తున్న హోంగార్డు ఎస్‌కే మస్తాన్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆయనను ఘనంగా సన్మానించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో మస్తాన్ ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ తరుపున వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ విజయ్‌బాబు, ఆర్ఐ హోంగార్డులు సుధాకర్, ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, జిల్లా హోంగార్డు అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఐఎల్‌యూ రాష్ట్ర సభలను విజయవంతం చేయండి

కొత్తగూడెంటౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా బోనగిరిలో 17, 18వ తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యక్షుడు జలసూత్రం శివరాంప్రసాద్ కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో గురువారం ఆయన మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే సభలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భూయాన్ వివిధ అంశాలపై మాట్లాడతారని తెలిపారు. న్యాయవాదులు కె.పుల్లయ్య, కిలారు పురుషోత్తం, ఏపూరి బాబురావు, భాగం మాధవరావు, రావిలాల రామారావు, పీ.వీ.కే ఆనంద్, పి.నాగేశ్వరావు పాల్గొన్నారు.

జీకే ఓసీ కార్మికులను ఇక్కడే సర్దుబాటు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీలో పనిచేస్తున్న కార్మికులను ఏరియాలోని వివిధ విభాగాలలో సర్దుబాటు చేయాలని కోరుతూ గురువారం ఏరియా జనరల్ మేనేజర్ రమేష్‌కు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ వినతిపత్రం అందజేశారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మల్టీపర్పస్ వర్కర్లు గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు జాతీయ జెండా ఎగరవేశారు. పల్లె ప్రగతి గ్రామసభల్లో తొమిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ప్రగతి నివేదికను చదువుతూ గ్రామాల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: పెనుబల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఉద్యోగులు, కార్మికులు





టేకులపల్లి: కోయగూడెంలో ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, సులానగర్‌లో జీపీ వర్కర్లకు సన్మానం



సుజాతనగర్: బేతంపూడిలో పల్లె ప్రగతి ర్యాలీ



ఇల్లెందురూరల్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మీనగర్ సర్పంచ్ పూనెం కవిత



బొజ్జాయిగూడెంలో పల్లె ప్రకృతి వనం వద్ద ప్రజాప్రతినిధులు, స్థానికులు



పాల్వంచరూరల్: తోగ్గూడెంలో ర్యాలీ



చుంచుపల్లి: రామాంజనేయకాలనీలో పల్లె ప్రగతి వేడుకల్లో పాలకవర్గ సభ్యులు



జూలూరుపాడు: వెంగన్నపాలెంలో జెండాకు వందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తగూడెంరూరల్: మల్టీపర్పస్ వర్కర్లను సత్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

నేడు పట్టణ ప్రగతి సంబురాలు



మాట్లాడుతున్న దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పక్కన కమిషనర్ అంకుషావలీ

ఇల్లెందు: స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతున్న సందర్భంగా ఇప్పటి వరకు సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకై పట్టణ ప్రగతి దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటుకు పూర్వం 2004 – 2009 వరకు ఇల్లెందు మున్సిపాల్టీకి రూ.15 కోట్లు నిధులు రాగా తెలంగాణ రాష్ట్రంలో రూ.153కోట్లు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే జీఓ 76లో భాగంగా సుమారు 800 మందికి ఇంటి పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. స్వరాష్ట్రంలో పట్టణ ముఖచిత్రం మారిపోయిందన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

రైతులకు సంకెళ్లు గర్హనీయం..

సింగరేణి(కొత్తగూడెం): బంగారు తెలంగాణ అంటే.. రైతులకు సంకెళ్లు వేయటమేనా అని, రైతుల పట్ల కేసీఆర్ నిరంకుశ వైఖరిని ఖండించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 13న ఖమ్మం మిర్చి రైతులకు, 14న యాదాద్రి భువనగిరి రైతులకు సంకెళ్లు.. ఈరోజు ఇంకెవరికి వేస్తారోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఆర్ఆర్ అసైన్‌మెంట్ మార్పుపై ఆందోళన చేసిన నలుగురు రైతులకు బేడీలు వేసి జైలుకు పంపడాన్ని మేధావులు, విద్యార్థి సంఘాల నేతలు ఖండించాలన్నారు. జాతీయ రహదారి విస్తరణ, రిలయన్స్ పైప్‌లైన్ ఏర్పాటు, కాళేశ్వరం కాలువ నిర్మాణం కోసం మూడుసార్లు భూములు కోల్పోయారని, వారి భూములను లాక్కొని వారినే జైలుకు పంపించటం సరికాదని ఇటువంటి చర్యలు కేసీఆర్ ప్రభుత్వం మానుకోవాలన్నారు. లేదంటే పార్టీలకు అతీతంగా ప్రజలను మమేకం చేసి ఆందోళన కార్యక్రమాలను ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా రాజీవ్‌గాంధీ యూత్ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ కోరారు. కొత్తగూడెంలోని బస్టాండ్ సెంటర్ రైటర్ బస్తీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం క్విజ్ పోటీల ప్రచార కరప్రతాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పోటీలో పాల్గొన్న ప్రతి నియోజకవర్గానికి 40 ప్రోత్సాహక బహుమతులు 10 స్మార్ట్ వాచీలు, 10 ఇయర్‌పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్‌లు, 10 పవర్ బ్యాంక్‌లు, అదేవిధంగా ప్రతి నియోజకవర్గానికి మహిళా టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటర్, ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలో 16 – 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు జూలై 1వ రకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జూలై 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9381993235 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకొని నల్గొండ జిల్లా జిచెన్నారం చేరుకుంది. పలువురు నాయకులు అక్కడకు వెళ్లి భట్టిని కలుసుకుని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: జిచెన్నారంలో భట్టి విక్రమార్కతో కేక్ కట్ చేయిస్తున్న టేకులపల్లి మండల నాయకులు



సుజాతనగర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



జూలూరుపాడు: భట్టికి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ మండల నాయకులు

వాహనాలకు వేలంపాట

ఇల్లెందు: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఇల్లెందు సర్కిల్‌లో వివిధ కేసులలో పట్టుబడిన ఐదు వాహనాలను శుక్రవారం ఇల్లెందు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వి.రాజశేఖరరావు గురువారం తెలిపారు. ఈ వేలంలో ఒక టాటా మ్యాజిక్, 2 ఆటోలు, 2 బైక్‌లు ఉన్నట్లు చెప్పారు. ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

టూవీలర్ మెకానిక్ యూనియన్ ఎన్నిక



బైక్ మెకానిక్ యూనియన్ సభ్యులు

ఇల్లెందు: పట్టణంలో టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఎన్నిక కార్యక్రమం గురువారం ఇల్లెందులో జరిగింది. అధ్యక్షుడిగా ఈసం రమేష్, ఉపాధ్యక్షుడిగా పచ్చిపాల వెంకట్, సెక్రెటరీగా బస్వరాజు రాము, జాయింట్ సెక్రెటరీగా భూక్యా హరి, కోశాధికారిగా కస్తూరి ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా యాకూబ్ పాషా, ఖాజా, గౌరవాధ్యక్షుడిగా పులిపాటి మల్లేష్, ఎండీ రఫీ, కమిటీ సభ్యులుగా రుద్ర లక్ష్మణ్, లోథ్ సంజయ్, సదానందం, పాయం రామకృష్ణ, మొయినుద్దీన్, చోటు తదితరులు ఎన్నికయ్యారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం, పాల్వంచలోని స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మొయిద్దీన్ బృందం తనిఖీ నిర్వహించారు. మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్‌లు లింగ నిర్ధారణ పరీక్షలను చేయరాదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది..

టేకులపల్లి: అన్నిదానాల కంటే రక్తదానం మహా గొప్పదని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. రక్తదానంపై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు గురువారం సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. 18 – 65 ఏళ్ల వయస్సు కలిగి 50 కేజీలపైన బరువు ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నట్లవుతుందని పేర్కొన్నారు. పల్లె దవాఖానా వైద్యులు ధరణి, శైలజ, హారిక, ఇంద్రజ, అమూల్య, నిఖిత, భార్గవి, స్వప్న, అరుణాదేవి, అరుణకుమారి, కృష్ణవేణి, మానస, సుజాత, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో పల్లెలు



పెనగడప గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: గతంలో ఎన్నడూ లేని విధంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నేడు పల్లెలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పెనగడపలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రసంగించారు. సీఎం కేసీఆర్ పల్లెప్రగతి విజన్‌తో తెలంగాణలోని పల్లెల్లో అన్నిరకాల మౌలిక వసతులు సమకూరుతున్నాయని చెప్పారు. గతంలో పోలిస్తే ఇప్పుడు గ్రామాల రూపురేఖలు మారిపోయాయన్నారు. నిరంతరం పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని, అలాగే పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎంపీపీ బాదావత్ శాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్పంచ్ మాలోతు కళావతి, ఉప సర్పంచ్ కట్ట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందులు, విత్తన దుకాణాల్లో తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు, వెంగన్నపాలెం గ్రామాల్లోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.కరుణశ్రీ, జూలూరుపాడు ఏఓ ఎస్.రఘుదీపిక విత్తన, ఎరువుల దుకాణాల్లో సోదాలు చేశారు. రిజిష్టర్లు, బిల్లు బుక్స్, ఇన్వాయిస్, విత్తన స్టాక్ డాక్యుమెంట్లను పరిశీలించారు. కరుణశ్రీ మాట్లాడుతూ.. వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్నందున తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు, సంబంధిత వ్యాపారులపై పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న రఘుమాచారి

కొత్తగూడెంటౌన్: సమాచార హక్కు చట్టం పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం తెలంగాణ కన్జూమర్స్ అండ్ ఇన్‌ఫర్‌మేషన్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఫర్‌మేషన్ రైట్స్ కోఆర్డినేటర్ కమిటీ మెంబర్ జూలూరి రఘుమాచారి దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో జరిగే అవినీతి అక్రమాలను వెలికితీసే సామాన్యుడి చేతిలో వజ్రాయుధం సమాచార హక్కు చట్టం అన్నారు. ఇలాంటి సమాచార హక్కు చట్టాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చట్టం పట్ల కొందరు జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఎంతో బాధాకరమని తెలిపారు. ఇకనైనా అధికారులు సమాచార హక్కు చట్టానికి సహకరించాలన్నారు. అన్నబోయిన ఎల్లయ్య, కోడూరి నాగేశ్వరావు, బుదారపు చరణ్, మహంకాళి వంశీ, పోన్నం రాజేష్, కాసర్ల గోవిందాచారి, కోమరోజు సదానందం తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయండి



పాల్వంచరూరల్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెన్షన్లు, ఎస్ఐ ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధి బస్వతారకకాలనీలో ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ కనకదుర్గకు అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోగా, టీఏ, డీఏలు చెల్లించడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.సత్య, పండగ రమణ, రాజ్యలక్ష్మి, అచ్చమ్మ, రమ, రోజా, ముంతాజ్, శ్రీదేవి, లక్ష్మి, రమ, దేవి, రాణి, నిర్మల, మౌలాబి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనం అమలు చేయడంతోపాటు సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ లక్ష్మీప్రసన్నకు అందజేశారు.


ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌లో నెలకొన్న సమస్యలపై జీపుజాతా నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మరియా, ఫాతిమా, రాంబాయి, యాకమ్మ, వెంకటమ్మ, దేవేంద్ర, అంజమ్మ, మౌనిక, సుజాత, కోటమ్మ, లక్ష్మి, ఎల్లాబాయి, సోని, స్రవంతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై ప్రత్యక్ష పోరుకు సిద్ధం కండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ సమస్యను పరిష్కరించలేదని, పరిష్కారం అయ్యే వరకు ప్రత్యక్ష పోరాటానికి మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. మిషన్ 50 గో టూ విలేజ్ పేరుతో ప్రతి గ్రామంలో నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, మాదిగ ఉపకులాల ఐక్యతను, ఆత్మ గౌరవాన్ని పతాకస్థాయిలో నిలిపి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణను అమలు చేసేవిధంగా పోరాటం సాగించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం రాజధానిలో జూలైలో తలపెట్టిన ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు, ఈనెల 27వ తేదీన పాల్వంచలోని లారీ అసోసియేషన్ హాల్‌లో సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని సభకు మాదిగలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. నాగమణి, మిరియాల వెంకటేశ్వర్లు, చర్ల వెంకటప్పయ్య, గంగపురి శ్రీను పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

మంచినీటి పథకాన్ని పునరుద్ధరించండి

జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ గాంధీనగర్‌తండాలోని రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. తండా ప్రజలకు డైరెక్ట్ పంపింగ్ వ్యవస్థ (డీపీ) రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా జరిగేది. అయితే మిషన్ భగీరథ పథకం వచ్చిన తరువాత డీపీ విద్యుత్ మోటార్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మిషన్ భగీరథ నీళ్లు సరిపడా నీళ్లు రాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. డీపీకి తిరిగి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్య పరిష్కరించాలని తండా ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. – జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : కృష్ణవేణి,
ఏఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, జూలూరుపాడు
సెల్ నంబర్: 6309954516